# అల్లసాని - ప్రవరుడు

ఆలోచనాధీన మానసుడైన పెద్దన చెంత కొక దాసివచ్చి నమస్కరించి నిలచినది. కస్తూరి, జవ్వాదుల వాసనలు వెదజల్లునొక కమ్మ నాతని కొసంగి ప్రక్క కొదిగినది. దాని విప్పినాడు పెద్దన.

"అల్లసాని పెద్దనామాత్యుల దివ్య సన్నిధికి—
దేవదాసి ముద్దునాగ విన్నపములు.
స్వామీ!


అనాడు నాట్యావసానమున బహుమతి ప్రదాన మొనర్చి నా చెల్లెలి నాట్యమును కొనియాడినారు. తాము కవులు, పండితులు. సరస హృదయులు. నా చెల్లెలు మేఖల సాహిత్యమున కృషి యొనర్ప తమ సేవా భాగ్యమును కోరుచున్నది. అందులకు తమకన్న తగినవారు లేరని నా నిశ్చయము. ఆమెను శిష్యురాలుగా అంగీకరించి సేవలొనర్చు కొను భాగ్యమును కలిగించ ప్రార్థించుచున్నాను. ఈనాటి వసంతోత్సవమును ప్రారంభించుటకు మహారాజులు తమ్మాహ్వానించుటకు అనుజ్ఞ నొసంగినారు. ఈ మా చిరువాంఛను నిరాకరింపక మా గృహము నీ దినము పావన మొనర్ప ప్రార్థించుచున్నాను.

ఇట్లు
ముద్దునాగ."

ఈ లేఖ ఆతని ఆశ్చర్యము నిముడింప జేసినది. ఈ లేఖయందొక అధికారము ధ్వనించిన దాతనికి. ముద్దునాగ రాయల ప్రియురాలు. మేఖల వారకాంత. స్త్రీ సన్నిధానము హృదయ నవనీతము దరికి అగ్నిని తెచ్చుటవంటిది. జను లేమనుకొందురు? తన తండ్రి ఏమనును? తాను నిర్లిప్తుడుగా నుండగలడు. కాని అది పద్ధతి గాదు.

పెద్దనకు తన భార్య జ్ఞప్తికి వచ్చినది. రాజకీయముల మూలమున తన భార్యను విడచి విజయనగరము రావలసి వచ్చినది తాను.

శిష్యరిక మొనర్పగోరిన ఆమె వాంఛను నిరాకరించుట తన మనో దౌర్బల్యమును మాత్రమే సూచించును.


STATE CENTRAL LIBRARY
HYDERABAD A.P.

మనసిచ్చిన మగువ ఎంతటి కష్టనష్టాలనయినా భరిస్తుంది. మరణాన్ని సైతం చిరునవ్వుతో ఆహ్వానిస్తుంది. ఆమెకు సాధ్యంకాని దేదీలేదు కాని మానస చోరుని తిరస్కారం భరించలేదు ఆ వ్యథ ఎంతటి దుస్సహమైనదో ఆమెకే తెలుసు ఇంతేనా ఆమెను తిరస్కరించినవాడు కవి అయితే అది కేవలం కవితకు వస్తువుగా ఉపయోగపడే యోగ్యత మాత్రమే సంతరించుకొంటుంది.

అందున, ముద్దునాగ రాయల ప్రియురాలు. తిరస్కరించిన, రాయలకు తమయం దామె ఆగ్రహము కలిగించగలదు. ఈ చిన్న విషయమును పురస్కరించుకొని రాయలు తమపై ఆగ్రహింతురా? ఏమో? స్త్రీ లెంత జేయు వారు!

కనుగొత్తి దాసివైపు చూచినాడు. అది నమస్కరించి జవాబునీయ గోరినది.

తాను ప్రారంభోత్సవమున కరుదెంతునని చెప్పుమనినాడు పెద్దన. దాసి వెడలిపోయినది.

చొక్కనామాత్యు లటు వచ్చినారు.

ఆలోచనాధీనుడైన కుమారుని గాంచి, "పెద్దనా!" అనినారు. పెద్దన తలయెత్తి చూచి, ఆ లేఖను తండ్రి చేతియం దుంచినాడు.

చొక్కనామాత్యులు దానిని చదివినారు. అతని ముఖమున ఒక చిరునవ్వు విరిసినది.

"నీ అనుమాన మేమి, పెద్దనా?"

"మేఖల అత్యంత సౌందర్యవతి. విలాసిని" అనినాడు పెద్దన.

"శిష్యురాలు కాగోరుచున్నది గదా?"

"ఆ శిష్యత్వ మంగీకారయోగ్యమా?"

"ఏల కాకూడదు, నాయనా? విద్యవలె భావించి, శిష్యురాలుగా స్వీకరించుటలో దోషమేముండును.?"

"లోకము మెచ్చునా?"

"లోక మేమనినను, మన నిర్మలతపై ఆధారపడి యుండునయ్యా! మన హృదయము కళంకితము కానంతవరకు లోక మేమనుకొనినను జడియవలసిన అవసరమేలేదు. నిజము కొంత కాలమునకు లోకము తెలిసికొనగలదు."

"నా హృదయ మీ విషయమున విముఖముగా ఉన్న దేమో? కాని ఆమె ముద్దునాగ సోదరి."

"అసలదియు నాలోచింపవలసిన విషయమే. రాయలకు మనపై ఆగ్రహము కలుగునేమో?"

"రాయలిట్టివాడని నే నంగీకరింపను" అనినాడు పెద్దన.

"ఇంత ఆలోచన మెందులకయ్యా? విద్యాభిక్ష కోరినవారిని నిరాకరించుట ధర్మమే కాదు. ఆమె నంగీకరించుటలో ననిష్టమేమియును లేదు, పెద్దనా" అనినాడు చొక్కనామాత్యుడు.

"చిత్త"మనినాడు పెద్దన.

పెద్దన పల్యాంకిక మేఖల ఇంటి ముందాగినది. అది వారకాంతా గృహమా? రాజభవన

## అల్లసాని - ప్రవరుడు

మునే ధిక్కరించు సొగసులీనుచున్నది. ఆ గృహోపకరణములూ అలంకారము లన్నియు దేవేంద్ర లోకమును తలపింపజేయుచున్నవి. ముద్దునాగ భవన మా వేశ్యావాటికలోని భవనములకు తలమానికము.

ఆనాటి వారకాంతలు సర్వ కళా కుశలలు. విదుషీమణులు. కవిత్వ తత్త్వ ప్రవక్తలు. వెలయాండ్రనుట వారి అభిజాత్యమునకే అవమానము. వేశ్యాంగనలలో మహాభక్తురాండ్రున్నారు. రాజకీయ చతురలున్నారు.

పల్లకి దిగిన పెద్దనామాత్యునకు ముద్దునాగ ఎదురువచ్చినది. కావ్య నాటక పురాణేతిహాసములు చదివిన ప్రౌఢ ఆమె. ఆమెకు గర్వము లేదు. ఆమె రాయలకు భోగిని. ఇతర సమయముల యోగిని. ఆమెయందలి ఆకర్షణ మెట్టిదో. ఆత్మనిగ్రహము నట్టిదే.

"కవీంద్రులు దయచేయుటచే మా గృహము పావనమైనది" అనినది నాగ. పెద్దన చిరునవ్వు నవ్వినాడు.

'ఏనాడు రాయలు "కవీంద్రా" అనును. అది ఈమెతో అనియుండవచ్చును' అనుకొనినాడు పెద్దన.

మేఖల అటు కరుదెంచినది. పెద్దనను గాంచిన ఆమె కేమో సిగ్గైనది. నాగ తీరు వేరు; మేఖల పద్ధతి వేరు. అది మైదానముల నతి విశాలముగ పారెడి మహా ప్రవాహము. ఇది కొండలపైనుండి క్రిందకురుకు సెలయేరు.

ఆమె పెద్దన ఎదుట నిలబడినది. నాట్య భంగిమలో నమస్కరించినది. అజంతా సుందరి ప్రతిమను తలపించినది.

"కళ్యాణప్రాప్తిరస్తు" అని దీవించినాడు చేయెత్తి పెద్దన.

ఆ ఆకారమునే తనివితీర గాంచినది మేఖల.

ఆ పచ్చని దేహము, ఆ కన్నులలోని తేజ మామెకు చక్కిలిగింత లిడినవి. ఆమె హృదయ కుసుమము వికసించి వాసనలు వెదజల్లినది.

తన అక్క వేసిన పందెము తన కుపకారకమే ఐనదనుకొనగా ఆమెకు నవ్వు వచ్చినది. ముద్దునాగ గమనించినది.

**జి. ఆంజనేయులు**

"మా గృహమును గాంచిన కవీశ్వరు లేమాలోచించుచున్నారు?" ప్రశ్నించినది ముద్దునాగ.

ఆ ప్రశ్నకు పెద్దన జవాబీయలేదు. అతనికి అంతయు క్రొత్తయైనది.

ముద్దునాగ అతని చేయి పట్టుకొని లోనికి నడిపించుకొనిపోయి, పట్టు పరుపులు పరచిన ఒక సింహాసనమున అతని నుపవిష్టుని గావించినది. అగరు వాసించు అగ్గి కరండ మొకటి ఆ ప్రదేశము ధూమావృత మొనర్చుచున్నది.

ఆహ్వానితులు ఉత్సవమున కరుదెంచుచున్నారు. వచ్చినవారలకు పరిచారికలు [illegible] కర్పూరపు విడెము లందించుచున్నారు.

మేఖల ఒక సువర్ణ భాండము హస్తద్వయమున చేత నిడుకొని వచ్చినది. ఆ భాండము నిండుగ వసంతమున్నది. ఆ వసంతమును ప్రథమముగ అప్పటి గున్నమామిడిపై జల్లి తరువాత వసంతోత్సవ ప్రారంభ సూచనగా అట్టి సమ్మానము జరిపించుటకు ఒక యువతి నాహ్వానించుట ఆచారము.

ప్రతి సంవత్సర మా ప్రారంభమును మహారాజు లాచరింతురు. కాని పెద్దనకా గౌరవ మిప్పుడు దక్కినది.

ఆ సువర్ణ భాండమును పెద్దన ముందిడినది మేఖల. మహారాజు రాయ లప్పటికు వచ్చుచున్న సూచనలైనవి. రాయలటకు విచ్చేసినారు.

అతిథులు అందరును లేచి నిలబడినారు.

తా నిట్టి హోదా రాయలకంటె ముందు పెద్దనకేమో కష్టమైనది.

"కానిమ్ము, పెద్దన కవీంద్రా! ఉత్సవ మాగరాదు" అనుచు రాయలు లోని సింహాసనముపై నుపవిష్టులైనారు.

ఆ వసంత భాండమున నొక లేత మామిడి మండ యున్నది. ఆ మండ నెత్తి ముంచి, మావి గున్నపై జల్లినాడు పెద్దన.

కొన్ని వసంతపు బిందువులు మేఖలపై రాలినవి. ఆమె కన్ను లింత యొనర్చుకొని చూచినది పెద్దనను. రాయలు నవ్వినారు.

వసంతోత్సవమైపోయినది.

"మేఖలా! కవిగారికి [illegible] చూడు"మని రాయలతో ముద్దునాగ కేళీ భవనమున కొకవైపున కరిగినది. సభాసదులు తమ గృహముల కరిగినారు.

మేఖల, పెద్దన అటు మిగిలినారు.

ఆమె సౌందర్యవతి; విలాసిని. ఆమె మాటలో ప్రతి ధ్వనిలో నేదో క్రొత్తదన మాధుర్యము కనిపించినది.

"నీకు సాహిత్యోపాసన మొనర్పు కోరిక గలుగుట సంతోషింపదగినది." మాటలాడుట కేమియు లేక, అనినాడు పెద్దన.

"అగును, స్వామీ! నన్ను మీ శిష్యురాలిగ అంగీకరించి స్నేహాభాగ్యము నొసంగిన నా జన్మ తరింపగలదు."

ఈ వాక్యము దాతనిలో ఆలోచన రేపినది.

ఆమె ఒక విడెము పెద్దన చేతనుంచినది. విటుని చేత విడె ముంచుట వేశ్యా లక్షణము!

దాని నతడు పళ్ళెరమం దుంచినాడు.

ఆమె హృదయము చివుక్కుమనినది. కన్నులెత్తి దీనముగ పెద్దన ముఖమువైపు చూచినది.

"కవీంద్రులు నా హృదయమును గ్రహింపజాలకుందురు." మేఖల అనినది.

"నీ యందలి ఆసక్తి నిన్ను త్వరలో సాహిత్యమందు విద్వాంసురాలుగ నొనర్పగలదు." వినిపించుకొనకట్లే అనినాడు పెద్దన.

"నా హృదయాసక్తిని మీరు గుర్తింపజాలరా, కవీంద్రా?" ఆమె ప్రశ్నించినది.

"నీ వేయే శాస్త్రములలో పరిశ్రమ మొనర్చినావు?" ప్రశ్నించినాడు పెద్దన.

"శాస్త్రము లన్నిటిలో కామశాస్త్రము నా అభిమాన విషయము. తమవద్దనే నా శాస్త్ర మర్మములు గ్రహింప గోరుచున్నాను." ఆమెకు నవ్వు వచ్చినది. ఆ చిరునవ్వు ముఖములోనికి రక్తము మరలించి, రాగరంజిత మొనర్చినది.

ఆ ముఖమందలి కామాసక్తిని పెద్దన గమనించినాడు. 'ఇదేమి దౌర్బల్యము? ఇక నా నవ్వుట నుండుట ప్రమాద హేతువు. నే నేకపత్నీ వ్రతుడు. నా భార్యకు నా నన్యాయ మొనర్ప లేను.' భార్యా రూప మాతని కనులముందు మెదలినది. అతడు కన్నులు మూసికొనినాడు.

"కవీంద్రా!" మేఖల పిలిచినది.

అతడు కనులు తెరచినాడు. సమాధి చెదిన యోగియే యైనా దాతడు. మేఖలకే జారి పోయిన బ్రాహ్మణ యువకుని గూర్చి.

"కవీంద్రా! మేము వెలయాండ్రము." ఆమె మోమున దీనత్వము గూడు కట్టినది. "కాని, స్వామీ! తమ చిరస్నేహమే నేను వాంఛించుచున్నాను" అనిన దామె. ఆమె గొంతు జీర పోయినది. పురుషుని కామభిక్ష అర్థించుట స్త్రీలోకమున కరుదుగా అగు ననుభవము. ఆమె కిది క్రొత్త యనుభూతి.

పెద్దన మాటాడలేదు.

"నిక్కము దాచుట నా కిష్టమైనది కాదు. మీపైన నా హృదయము చిక్కినది. నన్నా మన్మథునకు దారి తొలగించుటో, లేక హృదయపరిష్వంగములో కౌగిటి గారవించుటో నిర్ణయించుడు, కవీంద్రా?" అని మేఖల పెద్దనకు దగ్గరగా నిలిచినది.

గమగమ వాడు చెక్కపు జవాజి వాసన తాంబూల ప్రసాదము నాసాపుటముల ప్రవేశించినవి. అతనిలో నొక వికార ముదయింప జేసినవి.

"నాకలన చిందగోరిన శాస్త్రజ్ఞాన మిది యేనా?" ఒకింత కఠినముగా ప్రశ్నించినాడు పెద్దన.

'తన అక్క పందెమేమి కానగును? ఈతనిపై తనకేల ఇంతటి మమకారము కలుగు



సంధ్యవేళ

చిత్రం—పి. ఎస్. ప్రభాకరరెడ్డి (కాకినాడ)

చున్నది? ఈత డింతటి నిర్మోహి యేమి? తన ప్రయత్నలోపము ఉండరాదు' అనుకొనినది మేఖల.


"నాట్యమునాడే మీ రూపము నన్నాకర్షించుకొనినది, స్వామీ! నేనా భావము నణచుకొన ప్రయత్నించి విఫలనైనాను. నేనే మొనర్ప గలను, స్వామీ? అబలను!" అనినది మేఖల.

ఆమెలోని మోహపు గాఢతను గమనించినాడు పెద్దన. 'రాయలు తన నేల ఒంటరిగా వదలి పోయినాడు?' పెద్దన ఆలోచనలో పడినాడు.

"వలచి వచ్చిన వనితను నిరాకరించుట ధర్మమా, స్వామీ!" ఆమెలోని నిరాశ అంతయు గూడు కట్టుకొనిన దావాక్యములో.

"నే పత్నీయుతుడను, మేఖలా!" అనినాడు పెద్దన.

"భార్యా యుతులకు మా పొందు నిషిద్ధమా, కవీంద్రా! ఈ సామంతు లీ మహారాజా లందరకు





వెలువడినవి



ఆంధ్రప్రభ ఉగాది నవలల పోటీలలో బహుమతి పొందినది.

రు. 4-00




రు. 2-50

ప్రతులకు :
నవోదయ పబ్లిషర్సు,
విజయవాడ-2.


# అల్లసాని-ప్రవరుడు

భార్యలకు కొదువా?" ఎదురు ప్రశ్న వైచినది మేఖల.

"తన భార్య పరపురుషుని చూడరా దనుకొను పురుషుడు తా నేల పరస్త్రీని వాంఛింపవలయునో? అదేటి ధర్మమో నా కర్థము కాలేదు. ప్రేమ అనున దొక్కటే యొక్కచోటనే. దాని నిన్ని విధముల విభజింప వలయునదునా?"

"మీకు సమాధాన మీయగలుగుదునా, స్వామీ! ఇది ఆనందము. ఆనందానుభవమున నొక అంగము స్త్రీ. అట్లు కానినాడే వేశ్యావాటికలు పాడువడిపోవలసినదే."

"పవిత్రమగు గృహస్థ ధర్మము, తద్ద్వారమున లభించెడి మోక్ష సౌఖ్యము లానందప్రదములు. ఈ తుచ్ఛ సుఖములు మీసాలపై తేనెలు. రసానుభవ సిద్ధి కివి మార్గములే కావు" అనినాడు పెద్దన.

ఆతని నిగ్రహ మాతని యూహ లా హృదయ నైర్మల్య మెట్టిదో అవగాహనమైన దామెకు. 'ఇట్టి పురుషునితో సన్నిహితత్వమునగల స్త్రీ భాగ్యవతి గదా!' అనుకొనిన దామె.

"నే నందగత్తెను కానా? కళా కుశలత నాయం దేమైన తక్కువ సడెనా? ఇంతటి నిరాకరణమునకు నా అదృష్టమే కారణమా, స్వామీ?" కంట నీ రొలికించినది మేఖల.

"నిను కష్ట పెట్టినందులకు విచారము కలుగుచున్నది, మేఖలా! నా హృదయ మీ తగులములకు విముఖము. నే భోగవిముఖుడను గాను కాని ధర్మ బాహ్యములగు నీ తగులములు ఇహ పర దుఃఖసాధనములని నా అభిప్రాయము. నాకు ప్రాణాధికమైనది నా భార్య. ఆమె నా అర్ధాంగి. తన సర్వస్వమును భర్తకొరకర్పించిన ఆమెను వంచించి, తుచ్ఛమైన కామగత మార్గములను భోగము లనుకొని అనుభవించుట ఆత్మవంచనము కాదేమి?" అనినాడు పెద్దన.

'తన నీతడు తిరస్కరించుచున్నాడా? అట్లగుపించుటలేదు. భార్యయందలి ప్రేమతో నీత డిట్లగుచున్నాడా? ఆమె లేనందుల కీతడు దుఃఖించుటలేదు. ఈత డెంతటి నిర్మోహుడు! అయిన స్త్రీ స్పర్శ నెంతవానినైన మార్చజాలదా? ఈత డనుకొను నంతటి సుంధముగా నవలు నదా, స్త్రీ?' అనుకొనినది మేఖల.

"ఈ కస్తూరపు విడెమైన గ్రహింపరాదా? స్త్రీ తనంత తా వలచివచ్చిన పెరికితనము చుల్కన గదా, స్వామీ?" గద్గద కంఠియై అనినది మేఖల.

కస్తూర విడె మందుకొన చేయి జాచినా డా బ్రాహ్మణుడు. ఆ కరపద్మమందు కస్తూర విడెముతో కూడ తన హస్తము నుంచినది మేఖల, ఆతని కనుపాపలలోనికి జూచుచు. స్త్రీ స్పర్శ ఆతని అంతరాంతరములలో సంచలనము రేపినది.

ఆతని హృదయ మొకింత ఊగిసలాడినది. రక్త మా శరీరమున ఉవ్వెత్తుగ ప్రసరించి కలత రేపినది. ఆత డామెవైపు చూచినాడు. ఆమె కామార్త.

ఆతనిలోని సంచలనమును గమనించిన దా స్త్రీ. 'తన స్పర్శ ఆతనిని రెచ్చగొట్టినది. ఇక నాతడు తననుండి తప్పించుకొనలేడు. స్త్రీ స్పర్శ కలుగునంతవరకే ధర్మపన్నములు. ఆపై అవి నని చేయును.' ఆతని చేతినుండి తనచేతి నామె తీయ లేదు. 'ఇది అవకాశము. కాని తన శరీరమున కూడ వేయి వీణల రాగ మాలపింపబడుచున్నది. తా నవత యగుచున్నది.' ఆమె పెద్దనను పెనవైచికొనినది. ఆమెలోని స్త్రీత్వ మిప్పుడు సహస్రముఖముల విజృంభించినది.

'ఈమె తన నే మోసగ్చుచున్నది? తాను పతితు డగుచున్నాడు.' భార్యారూప మా కన్నుల ముందు తాండవించినది. ఆతని హృదయమందు ధర్మ కామములకు ఘోర సంగ్రామ మారంభమై ముగిసిపోయిన దొక్క క్షణములో. ఆతడు నిం ద్రొక్కుకొనినాడు.

మహా వృక్షమును లతవలె మేఖల యాతనిని పెనవైచుకొనుచున్నది. ఇంకను, ఇంకను అతనితో లయించిపోవలె ననునది ఆమె ఆకాంక్షగా లోచినది.

"హూ"మ్మనినాడు పెద్దన. తన నాక్రమించుకొనుచుండిన ఆ తరుణీమణిని విదిలించివైచినా డతడు. వట్టి వరుపువై, అలంకారము లేని తీగవలె పడిపోయిన దామె.

ఆతడా సమయమున దుర్నిరీక్ష్యుడు. ఆ పడిపోయిన స్త్రీవైపొక్క పర్యాయము చూచినా డతడు.

పెద్ద పెద్ద అంగలతో ఆమెను వదలి అచటి కదిలినాడు.

తనకొరకు నిరీక్షించుచున్న సేవకులతో పాలకి నెక్కి చనినాడు పెద్దన బరువై, కలత చెందిన హృదయముతో.

'తా నోడిపోయినది. ఆత డేటి పురుషుడు? లొంగుచున్నట్లు, కలత చెందినట్లు కనిపించుటచే తా నట్లు సాహస మొనర్చినది. తన ప్రయత్న మిట్లు విఫలమైనది. తనకొరకు పడిగాపు లున్నారు పురుషులు. ఈత డొక యోగి. తన ప్రవర్తన మిప్పుడు తనకే లజ్జగా నున్నది. ఎంతటి పురుషునైన లొంగదీయగల ననుకొనిన తన గర్వమిప్పుడు సడలిపోయి, పునాది లేకుండ పోయినది. కాని తనలోని నిరాశ? తన కేల, ఆతనిపై క్రోధము కలుగుటలేదు? తన కవమానము కాదా, ఇది? తన ధర్మము తను నిర్వహించుకొనినా డా నిర్మలరూపుడు.'

ఆమె కన్నుల నీరూరినది. దిండుపై ముఖ ముంచి ఒక్క క్షణము కన్ను మూసిన దా నిరాశా నిస్పృహలతో బరువగు బాధ నందుచున్న యోషామణి.

ముప్పనాగ మేఖల దాపున కరుదెంచినది.

ప్రక్కనున్నసింహాసనమున విశ్వబ్ధముగ కూర్చుండినాడు రాయలు.

ముద్దునాగ చెల్లెలి శిరముపై చేయివేసినది. ఆమె తల ఎత్తి అక్కవైపు చూచినది. ఆమె కన్నులనుండి నీరు ముత్యాలవలె రాలి దిండును తడిపినది.

"నీ చెల్లె లోడినది, నాగా!" అనినాడు రాయలు.

"ఒక ప్రయత్నమునకే ఓటమిని మే మంగీకరింపము, మహారాజా!" అనినది ముద్దునాగ.

"నా పెద్దన ధర్మ కర్మదీక్షా పరతంత్రుడని, నిర్మోహుడని నే తెలుపలేదా, భామినీ! అత డీ తాత్కాలికానందములకై చూచువాడు కాడు." చిరునవ్వుతో అనినాడు రాయలు.

మొగమెత్తి రాయలవైపు చూచినది మేఖల.

"మరొక ప్రయత్నమందైన అతడోడిపోవక తప్పదు, మహారాజా! మీరీ పందెమును మాత్రము గెలుచుకొనలేరు. నా కింకను గడువున్నది" అనినది ముద్దునాగ.

"అక్కా!" నెమ్మదిగా అనినది మేఖల.

"మా పెద్దనపై క్రోధము కలుగుచున్నదా, మేఖలా?" ప్రశ్నించినాడు రాయలు.

"లేదు, ప్రభూ! ఆ సరస్వతీ పుత్రునిపై, ఆ ధర్మ తత్పరునిపై కోపము కలిగిన నా కిక జన్మించ గతులుండునా? అతని నిస్సంగత్వమును కాంచినకొలది దాసిగానైన అతని సేవ కొనర్ప తహతహ లాడుచున్నది నా హృదయము." గద్గద స్వరముతో అనినది మేఖల.


"ప్రశంసనీయమైనవి నీ భావనలు. అతి నిర్మలమై, పల్లవ కోమలమైనది నీ హృదయము, మేఖలా! నీ వాంఛితము కొలదికాలములోనే తీర్చుకొనగలవు." రాయల కన్నుల ఆనందముల మెరవులు మెరసినవి.

ఆశ్చర్యముగ చెవు లప్పగించి చెల్లెలి మాటలు వినినది ముద్దునాగ అంతవరకు.

"ఈత డేమి ప్రవరాఖ్యునివలె నున్నాడే?" అనినది నాగ.

"ఏ ప్రవరాఖ్యుడు? మార్కండేయ పురాణమందలి ప్రవరాఖ్యుడా, నాగా? మేఖల వరూధిని యే. చక్కని పోలికయే. కాని ఆమె మోహపరవశయై అతని పొందు గోరి తిరస్కరింపబడినది. కాని ఈమె అతని పొందు తిరస్కరింపబడిన అనంతరము మోహపరవశయైనది" అనినాడు రాయలు.

ఆ ప్రభు వాలోచనలో పడినాడు. అతని ఊహ లెంతయో దూర మరిగినవి. అతని కన్నులలో ఆనంద ప్రవాహము వెల్లివిరిసినది.



శ్రీరంగపట్నంలోని రంగనాథస్వామి ఆలయం
ఫోటో — జి. వి. సత్యనారాయణరావు హైదరాబాదు-5)

"ప్రభువుల ఆనంద మెందులకో?" చిరుకోపముతో ప్రశ్నించినది ముద్దునాగ.

"నీ ఓటమికన్న, పెద్దన కవీంద్రుని ధర్మదీక్ష నా ఆనంద కారణము, నాగా! కాని పెద్దన కవీశ్వరున కొక అనుభవమును కల్పించి, అతని సాహిత్య కృషికి తోడ్పడిన నిన్నభినందింపక తప్పదు."

"మహారాజుల భావమేమో నా కర్థము కాలేదు." విస్మయముతో అనినది ముద్దునాగ.

"అనుభవవేదనా మిళితమైన కవిత శిరీష కుసుమ స్నిగ్ధముగా నుండును గదా, నాగా?" అనినాడు రాయలు.

మేఖల ముఖ మెఱ్ఱవడినది.

"ప్రభువులు నా విఫల ప్రణయమును గ్రంథస్థ మొనర్పజేయుదురా, ఏమి?" అనినది మేఖల.

మెలి దిరిగిన మీసముల మాటున ఒక చిరుహాస రేఖ వెలిగి, రాయల ముఖమున కొక క్రొత్త కాంతిని కొనివచ్చినది. ★